సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం। 22। ఏప్రిల్। 2024



రసవత్తరంగా పోటీలు
నూజివీడులో రెండు రోజులుగా ఏపీ స్టేట్ 9వ అంతర్ జిల్లాల బాలుర, బాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. 8లో



వలసల జోరు
ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో వలసలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో



రేషన్ బియ్యం స్వాధీనం
చింతలపూడి మండలం ప్రగడవరంలో ఓ ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 8లో

న్యూస్‌రీల్

మావూరమ్మకు అభిషేకాలు



అమ్మవారికి అభిషేకం చేస్తున్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: పాలకొల్లులో బంగారువారి చెరువుగట్టున కొలువైన మావూరమ్మ వారి జాతర మహోత్సవాలు ఈనెల 23న ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఆదివారం అమ్మవారికి మహిళలు 108 బిందెలతో అభిషేకం చేశారు. అమ్మవారి ఉత్సవాలు వారం పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శంకరాపు శ్రీనివాసు తెలిపారు.

ముత్యాలమ్మ ఆలయానికి తాకిడి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: ముత్యాలపల్లిలో బండి ముత్యాలమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయంలో విశేష పూజలు జరిగాయి. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ డి.రామకృష్ణంరాజు, సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిర్భయంగా ఓటేయండి



కోరుకొల్లులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాలకోడేరు: మీకు మేమున్నాం.. నిర్భయంగా ఓటు వెయ్యండి అంటూ ఆదివారం పాలకోడేరు పోలీసులు ప్రజలకు అభయమిచ్చారు. కోరుకొల్లులో ఏర్పాటు చేసిన ఎన్నికల అవగాహన సదస్సులో ఎస్సై నాళం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని, అది అందరి బాధ్యత అని అన్నారు. ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని భరోసా ఇచ్చారు. ఎన్నికల సందర్భంగా అల్లర్లకు పాల్పడవద్దని, అనవసరంగా కేసుల్లో ఇరుక్కుంటే భవిష్యత్‌లో ఉద్యోగాలు రావడం కష్టమవుతుందని యువతకు హెచ్చరించారు.

రేపటి నుంచి గో పథకాల పునః ప్రారంభం

ద్వారకాతిరుమల: లంపీ స్కిన్ వ్యాధి ప్రభావం తగ్గడంతో ఈనెల 23 నుంచి ద్వారకాతిరుమల చిన వెంకన్న క్షేత్రంలోని గోశాలలో గో దత్తత, గో దానం పథకాలను తిరిగి ప్రారంభిస్తున్నట్లు ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు ఆదివారం ప్రకటన ద్వారా తెలిపారు. గోవులను దత్తత తీసుకోదలచిన రైతులు, గోదానం చేసే భక్తులు గోసంరక్షణ శాలలో సంప్రదించాలన్నారు.

చెల్లింపు వార్తల నిబంధనలు పాటించాలి

ఏలూరు (మెట్రో) : ఎన్నికల సమయంలో చెల్లింపు వార్తలపై జర్నలిస్టిక్ ప్రవర్తన నిబంధనలను పాటించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రింట్ మీడియాకు చేసిన సూచనలను ఆదివారం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. మీడియాలో (ప్రింట్, ఎలక్ట్రానిక్) కనిపించే ఏదైనా వార్త నగదు లేదా వస్తువు విశ్లేషణ పరిగణనలోకి తీసుకుంటే దానిని చెల్లింపు వార్తలను అని నిర్ధారించవచ్చన్నారు.

ఫలితం పదిలం కావాలి

విజయీభవ
- నేడు టెన్త్ పరీక్షా ఫలితాలు
- జిల్లాలో 27,426 మంది విద్యార్థులు
- గతేడాది 65.93 శాతం ఉత్తీర్ణత
- ఉత్కంఠగా ఎదురుచూపులు

సాక్షి, భీమవరం : పదో తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల విడుదలకు సర్వం సిద్ధమైంది. సోమవారం ఉదయం 11 గంటలకు విజయవాడలో ప్రభుత్వ పరీక్షల విభాగం రాష్ట్ర డైరెక్టర్ దేవానందరెడ్డి ఫలితాలను విడుదల చేయనున్నారు. జిల్లాలో 27,426 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా అందరూ ఫలితాల కోసం ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు.

కొత్త జిల్లాల ప్రాతిపదికన..
గత విద్యా సంవత్సరంలో మాదిరి ఈ ఏడాది నూతనంగా ఏర్పడిన జిల్లాల ప్రాతిపదికన పరీక్షలు నిర్వహించారు. జిల్లాలో 14,624 మంది బాలురు, 12,802 మంది బాలికలు కలిపి మొత్తం 27,426 మంది విద్యార్థులకు గాను 127 కేంద్రాల్లో మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు పరీక్షలు జరిగాయి. ఎక్కడా లోటుపాట్లు లేకుండా జిల్లా విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేసింది. తెలుగు, హిందీ, ఇంగ్లిష్, గణితం, సోషల్‌కు సంబంధించి ఒక్కో సబ్జెక్టుకు 100 మార్కులు చొప్పున ఐదు పేపర్లు, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌లకు 50 మార్కులు చొప్పున పరీక్షలు నిర్వహించారు. అన్ని పరీక్షలకు బుక్‌లెట్ విధానాన్ని అమలు చేశారు.



పదో తరగతి పరీక్షలకు హాజరైన విద్యార్థులు (ఫైల్)

శరవేగంగా మూల్యాంకనం
పరీక్షల నిర్వహణ అనంతరం స్పాట్ వాల్యుయేషన్‌ను విద్యాశాఖ శరవేగంగా నిర్వహించింది. ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు జిల్లాలోని వీరవాసరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో జవాబు పత్రాల మూల్యాంకనం జరిగింది. చీఫ్ ఎగ్జామినర్లు, స్పెషల్ అసిస్టెంట్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు 700 మంది వరకు విధుల్లో పాల్గొని ఇతర జిల్లాలకు చెందిన దాదాపు 1.60 లక్షల జవాబు పత్రలను మూల్యాంకనం చేశారు. స్పాట్ వాల్యుయేషన్ జరిగిన 13 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేస్తుండటం గమనార్హం.

గతేడాది 65.93 శాతం
గత విద్యా సంవత్సరంలో 20,268 విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా 13,362 మంది పాసయ్యారు. ఉత్తీర్ణత 65.93 శాతంగా ఉంది. సప్లిమెంటరీకి 8,717 మంది హాజరుకాగా 4,156 మంది ఉత్తీర్ణులయ్యారు. గతేడాది ఉత్తీర్ణత తక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ విద్యా సంవత్సరంలో నూరుశాతం లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ నేతృత్వంలో విద్యాశాఖ యంత్రాంగం ముమ్మర కసరత్తు చేసింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలల్లో అదనంగా రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించారు. విద్యలో వెనుకబడిన (సీ గ్రేడ్) విద్యార్థులు 3,304, బాగా వెనుకబడిన (డీ గ్రేడ్) విద్యార్థులు 2,565 మందిని గుర్తించి వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. ప్రత్యేక కసరత్తు నేపథ్యంలో ఈ ఏడాది మంచి ఫలితాలు వస్తాయని జిల్లా విద్యాశాఖ అధికారులు భావిస్తున్నారు. ఫలితాల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

పదో తరగతి పరీక్షలు

బాలురు	12,802
బాలికలు	14,624
కేంద్రాలు	127
పరీక్షల తేదీలు	మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు
స్పాట్ వాల్యుయేషన్	ఈనెల 1 నుంచి 8వ తేదీ వరకు

మెరుగైన ఫలితాలు వస్తాయి



10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ప్రణాళికాబద్ధంగా పనిచేశాం. రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతుల నిర్వహణతో పాటు సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించి పరీక్షలకు వారిని సన్నద్ధం చేశాం. ఈ ఏడాది మంచి ఫలితాలు సాధిస్తామన్న నమ్మకం ఉంది.
– ఆర్. వెంకటరమణ, డీఈఓ, పశ్చిమగోదావరి

13న వేతనంతో కూడిన సెలవు

భీమవరం (ప్రకాశంచౌక్): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వచ్చేనెల 13న పోలింగ్ సందర్భంగా దుకాణాలు, సంస్థలకు సెలవు ప్రకటించడమైందని కార్మిక శాఖ ఉప కార్మిక కమిషనర్ పి.శ్రీనివాస్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. వ్యాపార, వాణిజ్య, పారిశ్రామిక సంస్థ లేదా ఏదైనా ఇతర సంస్థల్లో ఉద్యోగం చేస్తున్నవారు ఓటు వేయడానికి వీలుగా పోలింగ్ రోజున వేతనంతో కూడిన సెలవును మంజూరు చేయాలని పేర్కొన్నారు. సదరు సెలవుకు ఎటువంటి తగ్గింపు చేయరాదన్నారు. యజమానులు ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాతో శిక్షార్హులని తెలిపారు. అలాగే సంస్థల్లో వెలుపల పనిచేసే సాధారణ కార్మికులు కూడా రోజువారీ వేతనంతో వినియోగించుకోవడానికి అర్హులని పేర్కొన్నారు

ధాన్యం విక్రయించాలి

పెనుగొండ: వరి కోతలు పూర్తి చేసిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యాన్ని సత్వరం విక్రయించుకోవాలని పెనుగొండ మండల వ్యవసాయాధికారి పి.స్పందన సూచించారు. ఆదివారం మండలంలోని పెనుగొండ, వడలిలోని ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మిల్లులను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాలు కలిగిన ధాన్యాన్ని ఆర్‌బీకేల ద్వారా ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుందన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ధాన్యాన్ని రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దిగుమతులు చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు.

చంద్రబాబువి కల్లబొల్లి మాటలు

- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఈలి నాని, వడ్డి రఘురామ్

తాడేపల్లిగూడెం రూరల్ : అధికారంలోకి రావడం కోసం చంద్రబాబు చెప్పే కల్లబొల్లి మాటలను నమ్మవద్దని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కేఎస్ఎన్ కాలనీ, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, గొల్లగూడెం, మోదుగగుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ సీఎం జగన్ సంక్షేమ పథకాలతో ప్రజలంతా సంతోషంగా ఉన్నారన్నారు. ప్రతినెలా ఇంటికే అందిస్తున్న పింఛన్‌ను చంద్రబాబు, పవన్ కల్యాణ్ అడ్డుకునే ప్రయత్నం చేశారని విమర్శించారు. వలంటీర్లపై అభాండాలు వేశారని, ప్రతి 50 కుటుంబాలకు ఒక కుటుంబ సభ్యుడిగా అర్హతే ప్రామాణికంగా పథకాలు అందిస్తున్న వలంటీర్ల సేవలు నిస్వార్థమైనవి అన్నారు. రౌడీయిజం, దుర్మార్గం, ఆస్తులు లాక్కోవడం, అవినీతి మీ నైజమని జనసేన అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్‌ను ఉద్దేశించి అన్నారు. ఆయన మున్సిపల్ చైర్మన్‌గా కేఎస్ఎన్ కాలనీకి చేసిన ద్రోహాన్ని గుర్తు చేసుకోవాలన్నారు. ఆయన్ను గెలిపిస్తే వైఎస్సార్‌సీపీలోకి వెళ్తానని నిస్సిగ్గుగా చెబుతున్నారని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా గూడూరి ఉమాబాలను గెలిపించాలని కోరారు.



ప్రచారం చేస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ. చిత్రంలో ఈలి నాని, వడ్డి రఘురామ్

కులమతాలకు అతీతంగా పథకాలు

చీఫ్ విప్ ముదునూరి

నరసాపురం రూరల్: రాష్ట్రంలో సీఎం జగన్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. ఆదివారం మండలంలోని తూర్పుతాళ్ల గ్రామంలో ఆయన ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలు, కులాలు, మతాలకు అతీతంగా పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఐదేళ్లతో సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారన్నారు. అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందించారన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలు కూడా అమలుచేశారన్నారు. అవినీతికి తావులేకుండా పాలన అందించిన ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీలు బొక్కా రాధాకృష్ణ, చామకూరి నాగేశ్వరరావు, బండారు ఇస్సాకు నాయకులు ఉన్నారు.



ఓట్లు అభ్యర్థిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం



ప్రచారంలో పార్టీ కరపత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి

పాలకొల్లు సెంట్రల్ : నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమంతో పాటు సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతానని వైఎస్సార్‌సీపీ పాలకొల్లు ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అన్నారు. ఆదివారం పట్టణంలోని 29వ వార్డు చింతలతోట ప్రాంతంలో గోపాలరావు, భార్య మంగాదేవి ఎన్నికల ప్రచారం చేపట్టారు. రెల్లిపేటలో ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల ప్రేమాభిమానాలు చూసిన తర్వాత తనపై బాధ్యత మరింత పెరిగిందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రతి సమస్యా పరిష్కారం దిశగా కృషి చేస్తానన్నారు. టీడీపీ నాయకుల్లా తనకు డ్రామాలాడటం, వేషాలేయడం, కల్లబొల్లి మాటలు చెప్పడం చేతకాదన్నారు. సీఎం జగన్ రాష్ట్రాన్ని ఏ విధంగా సంక్షేమం, అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారో అదే మాదిరిగా నియోజకవర్గాన్ని తాను ప్రగతి పథంలో నడిపిస్తానన్నారు. కల్లబొల్లి కూటమి నాయకులు ఎందరు వచ్చినా జగన్నాథ రథచక్రాల ముందు నలిగిపోవాల్సిందేనని జోస్యం చెప్పారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనతో పాటు సామాన్య మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన మహిళా నాయకురాలు, నరసాపురం పార్లమెంటు అభ్యర్థి గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్నకు కానుకగా అందించాలని అభ్యర్థించారు. టీటీడీ బోర్డు సభ్యులు మేకా శేషుబాబు, యడ్ల తాతాజీ, చందక సత్తిబాబు, చందక ఉమాశైలజ, దనాల దుర్గమ్మ, అడబాల రమణ, శిడగం కిరణ్, నాయకులు ఉన్నారు.

రాష్ట్రంలో అవినీతిరహిత పాలన

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పోడూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అవినీతిరహిత పాలన సాధ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గుమ్మలూరు గ్రామంలో ఆదివారం ఆయన ఎన్నికల శంఖారావ పాదయాత్ర నిర్వహించారు. ప్రజలు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. అవ్వాతాతలు, మహిళలు, యువతను ఆయన ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో సీఎం జగన్ పార్టీలు, కులాలు, వర్గాలకు అతీతంగా అర్హులందరికీ ఇంటింటా సంక్షేమ పథకాలు అందించారన్నారు. మహిళలు, రైతులు, చేతి వృత్తిదారులు, చిరువ్యాపారుల సంక్షేమమే ధ్యేయంగా వారికి లబ్ధి కలిగించారన్నారు. ఆచంట నియోజకవర్గంలో అన్ని గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించామన్నారు. లంచాలు, అవినీతికి తావులేకుండా, అధికారులు, ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందించామన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రెండు ఓట్లను సీలింగ్ ఫ్యాన్ గుర్తుపై వేసి తనను ఎమ్మెల్యేగా, నరసాపురం ఎంపీగా గూడూరి ఉమాబాలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని శ్రీరంగనాథరాజు ప్రజలను అభ్యర్థించారు. పార్టీ మండల కన్వీనర్ పిల్లి నాగన్న, సర్పంచ్ గొట్టుముక్కల సోనియా, ఎంపీటీసీలు పోతాబత్తుల శ్రీలక్ష్మీదుర్గ, అంబటి సుధాకర్, జేసీఎస్ కన్వీనర్ పైడి ఏసుబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు అల్లూరి తిమ్మరాజు, నాయకులు ఉన్నారు.



గుమ్మలూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

కలెక్టర్ సుమిత్‌కుమార్

భీమవరం (ప్రకాశంచౌక్): ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా ఎలాంటి హింసాత్మక సంఘటనలు జరగకుండా విజిలెన్స్ బృందాలను అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఎన్నికలకు వివిధ శాఖలతో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విజిలెన్స్ బృందాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. హింసాత్మక ఘటనలు జరగకుండా చూడటంతో పాటు మద్యం, గంజాయి వంటి మాదక ద్రవ్యాలను నియంత్రించాలని, అక్రమ రవాణా అరికట్టాలని సూచించారు.

48 గంటల ముందు డ్రై డే
పోలింగ్‌కు 48 గంటల ముందు డ్రై డే పటిష్టవంతంగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఎస్ఈబీ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, నిష్పక్షపాతంగా సీజ్ చేయాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అందుబాటులో ఉన్న పోలీస్ దళాలు, ఇంకా అవసరమైన పోలీస్ ఫోర్స్ సేవలను వినియోగించుకునేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు గుర్తించిన రూట్లు, ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్, షాడో టీమ్స్‌ను అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏర్పాటు చేశామన్నారు.



రౌడీషీటర్ల బైండోవర్
ఎన్నికల్లో డబ్బు, మద్యం, మాదక ద్రవ్యాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ పేర్కొన్నారు. నేషనల్ డేటా బేస్ ఫర్ ఆర్మ్‌డ్ లైసెన్స్‌ను అనుసరించి జిల్లాలో లైసెన్సుడ్ ఆయుధాలు స్వాధీనం చేసుకుని, చట్టబద్ధం కాని ఆయుధాలు లేకుండా నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. రౌడీ షీటర్‌లను నిష్పక్షపాతంగా బైండోవర్ చేయడంతో పాటు నిబంధనల మేరకు వారి నుంచి నిర్దేశించిన మొత్తానికి సెక్యూరిటీ బాండ్ తీసుకోవడానికి ఆదేశించామన్నారు.

రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా..
జిల్లాలో ఎక్కడా రీ పోలింగ్‌కు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఎఫ్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాల వాహనాలకు జీపీఎస్ ఏర్పాటు చేశామన్నారు. వీరి పనితీరును ఎప్పటికప్పుడు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి పర్యవేక్షిస్తామన్నారు. సీ–విజిల్ ద్వారా, ఇతర విధానాల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించడంతో పాటు ముఖ్యంగా ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలపై చర్యలు తీసుకుంటున్నట్టు కలెక్టర్ స్పష్టం చేశారు.

జగన్‌తోనే రాష్ట్రం సుభిక్షం

విప్ గ్రంధి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

భీమవరం: ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేస్తేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల అన్నారు. ఆదివారం భీమవరంలోని ఆనంద ఇన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. ప్రభుత్వ విప్ శ్రీనివాస్ మాట్లడుతూ గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేయడంతో ప్రజల్లో వైఎస్సార్‌సీపీపై నమ్మకం ఏర్పడిందని దానిని మరింత బలంగా అమలు చేసేలా చర్యలు ఉంటాయన్నారు. చంద్రబాబుతో ఏర్పడిన బీజేపీ, జనసేన కూటమి మూడు ముక్కలాటగా మారిందని ఎప్పుడు ఎవరికి సీటు ఇస్తారో, తొలగిస్తారో తెలియని అయోమయ పరిస్థితిలో మూడు పార్టీల శ్రేణులు ఉన్నారన్నారు. ఇటువంటి తరుణంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులంతా సమైక్యంగా కలిసికట్టుగా పనిచేసి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి ఉమాబాల మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీపై ప్రజల్లో విపరీతమైన ఆదరణ ఉందని వారంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు వచ్చే విధంగా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పార్టీ నాయకులు ఏఎస్ రాజు, కామన నాగేశ్వరరావు, తోట భోగయ్య, కోడి యుగంధర్, గంటా సుందర్‌కుమార్, రేవూరి గోగురాజు, అభిరుచి రఘు, చెల్లబోయిన సూర్యప్రకాష్, పేరిచర్ల సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి ఉమాబాల. చిత్రంలో విప్ గ్రంధి శ్రీనివాస్

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నౌడు


నౌడు వెంకట రమణ

భీమడోలు: రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నేత నౌడు వెంకట రమణ వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆదివారం ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి నియామక పత్రాలు అందాయని నౌడు వెంకట రమణ ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. దీంతో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో ఇటీవల చేరిన బీసీ వర్గానికి చెందిన నౌడు వెంకట రమణకు కీలక పదవి వరించింది. నిడమర్రు మండలం పత్తేపురానికి చెందిన నౌడు వెంకట రమణ 2019 ఎన్నికల్లో ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత జనసేన పార్టీ విధానాలు నచ్చక పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాల వల్ల బీసీలకు మునుపెన్నడూ లేని విధంగా మేలు జరిగింది. దీంతో జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ అనైతిక పొత్తు పెట్టుకుని అందరికీ మేలు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విమర్శించడం సరికాదని భావించి ఇటీవల సీఎం వైఎస్ జగన్ సమక్షంలో జనసేనను వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా నౌడు వెంకట రమణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో సీఎం వైఎస్ జగన్ ఈ పదవిని తనకు అప్పగించారని, సీఎంకు రుణపడి ఉంటానన్నారు. ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ గెలుపునకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి ఏపీలో 16 ఏళ్లుగా రాష్ట్ర బీసీ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సారథ్యంలో రాష్ట్ర బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్‌గా పనిచేస్తూ బీసీ కులాల బలోపేతానికి కృషి చేస్తున్నానన్నారు.

వ్యక్తిపై తండ్రీకొడుకుల దాడి

కైకలూరు: పాతకక్షల నేపథ్యంలో దాడి చేసిన ఘటనపై రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. దొడ్డిపట్ల గ్రామానికి చెందిన గంగుల శ్రీనివాసరావుతో అదే గ్రామానికి చెందిన పలకర్ల మారరాజు, కుమారుడు శ్రీనుకు గతంలో గొడవలు ఉన్నాయి. ఈ క్రమంలో గంగుల శ్రీనివాసరావు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా అడ్డగించి తండ్రి, కొడుకులు దాడి చేశారు. శ్రీనివాసరావు ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీలోకి వలసల జోరు

- ఉమ్మడి జిల్లాలో పార్టీలోకి క్యూ కడుతున్న టీడీపీ, జనసేన నేతలు
- ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల సమక్షంలో పార్టీలో చేరికలు
- రాష్ట్రంలో వైఎస్ జగన్ సంక్షేమ పాలన బాగుందంటూ కితాబు

ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీలోకి ఇతర పార్టీల నేతలు క్యూకడుతున్నారు. ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. రాష్ట్రంలో సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరడంతో పాటు అభివృద్ధి జరిగిందని, వైఎస్ జగన్ పాలన బాగుందని వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన నేతలు చెబుతున్నారు. శని, ఆదివారాల్లో పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీలోకి చేరికలతో నాయకులు ఫుల్‌జోష్‌తో ఉన్నారు.


మంత్రి కారుమూరి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత జేసుల మంగన్న బ్రహ్మారావు


ఉప ముఖ్యమంత్రి కొట్టు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన చలంచర్ల మురళి, చలంచర్ల హరి


జనసేన, టీడీపీ కార్యకర్తలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్


వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన శ్రేణులకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న శ్రీనివాస్

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో 175 అసెంబ్లీ సీట్లను, అన్ని ఎంపీ సీట్లను వైఎస్సార్ సీపీ కచ్చితంగా గెలుచుకుంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ధీమా వ్యక్తం చేశారు. పట్టణంలోని 29వ వార్డు, మెంటేవారి తోట నుంచి టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఆదివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం వైఎస్ జగన్ దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా నిలిచారన్నారు. భీమవరం నియోజకవర్గంలో శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి పనులను చేశామన్నారు. పార్టీలో చేరిన వారిలో కె.హర్ష, బి.నరసింహ, జె.ఏసు, వి.శివ, టి.రాజేష్, జి.మణికంఠ, ఎం.అంతర్వేది, కె.శ్రీనివాస్, వి.రవితేజ, ఎస్.తేజ, జీ.లోకేష్, మెంటేవారి తోట నుంచి వడ్డీ సురేష్, కాటం వెంకటేష్, ముత్యాల సాయి, మానేపల్లి పవన్, గుబిలి కిషోర్, కోసని వంశీకృష్ణ, మందపాటి తరుణ్, జవ్వాది మణికంఠ, పిండి అంజి, సిల్లా రమేష్ ఉన్నారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, పిప్పళ్ల నాని, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఎస్ రాజు, ముత్యాల బుజ్జి, కొప్పర్తి జనార్దన్, అభిరుచి రఘు, ముత్యాల రామారావు ఉన్నారు.

వీరవాసరం జనసేన నాయకుల చేరిక

భీమవరం: వీరవాసరానికి చెందిన 50 మందికి పైగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మద్దాల సోమయ్య, కంచర్ల బోసు, బండి ప్రసాద్, మద్దాల అంజయ్య, చేగొండి తాతాజీ, ఉంగరాల రాంబాబు, తన్నీడి బాలాజీ, ముక్కు శ్రీనివాస్, రేడియో మూర్తి, జడ్డు నాని, కర్ల రామకృష్ణ, మద్దాల శ్రీధర్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

వైఎస్సార్ సీపీలోకి టీడీపీ నేత బ్రహ్మారావు

తణుకు టౌన్: తణుకు పైడిపర్రుకు చెందిన టీడీపీ జిల్లా వాణిజ్య విభాగం కార్యదర్శి జేసుల మంగన్న బ్రహ్మారావు ఆదివారం మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి కారుమూరి పార్టీ కండువా కప్పి బ్రహ్మారావును పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ, నాయకులు కొత్తపల్లి చరణ్, కే విశ్వేశ్వరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

గూడెంలో ఆర్యవైశ్య ప్రముఖుల చేరిక

తాడేపల్లిగూడెం అర్బన్: తాడేపల్లిగూడెంకు చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు చలంచర్ల మురళీ, చలంచర్ల హరిప్రసాద్ శనివారం ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. మంత్రి వీరికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ చలంచర్ల వారి కుటుంబంతో తనకు బాల్యం నుంచి సాన్నిహిత్యం ఉందని గుర్తు చేసుకున్నారు. మురళీ, హరి వైఎస్సార్‌సీపీలో చేరడం తనకు సంతోషంగా ఉందన్నారు. వీరి వియ్యంకుడు గుంటూరు ఎమ్మెల్యే మద్దాల గిరిధర్ కూడా తనకు సన్నిహిత మిత్రుడని చెప్పారు. తన 30 ఏళ్ల రాజకీయ జీవితంలో ఆర్యవైశ్యులకు ప్రత్యేక స్థానం ఇచ్చానన్నారు. చలంచర్ల మురళీ మాట్లాడుతూ మంత్రి కొట్టు సత్యనారాయణ నాయకత్వంలో తాము పనిచేస్తామని, కొట్టు వెంటే ఉంటామని స్పష్టం చేశారు.

ఉండిలో వైఎస్సార్ సీపీ పాగా వేయడం ఖాయం


పీవీఎల్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం టీడీపీ, జనసేన నాయకులు


పీవీఎల్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన ఆకివీడు మండలం అప్పారావుపేట టీడీపీ నాయకులు

కాళ్ల/ఉండి: టీడీపీ కంచుకోటగా ఉన్న ఉండి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ పాగా వేయడం ఖాయమని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. పెదఅమిరంలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఆకివీడు మండలం అప్పారావుపేట, ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన 40 మంది టీడీపీ, జనసేన నాయకులు ఆదివారం పీవీఎల్ నర్సింహరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి పీవీఎల్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అప్పారావుపేట గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకులు ప్రతాపనేని శ్రీధర్ బాబు, మేడవరపు అచ్యుత్‌లతో పాటు ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం టీడీపీ నాయకులు వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పీవీఎల్ మాట్లాడుతూ వైఎస్ జగన్ పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి చూసి ఆకర్షితులై ప్రతిపక్ష పార్టీల నుంచి పెద్ద ఎత్తున వైఎస్సార్ సీపీలోకి వస్తున్నారన్నారు. పార్టీ భీమవరం పరిశీలకులు మోటుపల్లి గంగాధర్, ఆకివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ జామి హైమావతి, ఆకివీడు ఏఎంసీ చైర్మన్ షేక్ రసూల్ బేబీ, జెడ్పీటీసీ సభ్యులు వేగేశ్న వెంకటరాజు, నాయకులు కనుమూరు ఆనందవర్మ, కేశిరెడ్డి మురళీ, అంబటి రమేష్, అప్పారావుపేట సర్పంచ్ మేడవరపు బాలు, ఎన్నార్పీ అగ్రహారం సర్పంచ్ సురవరపు వెంకటాచార్యులు పాల్గొన్నారు.

ఆటపాకలో గౌడ సంఘీయుల చేరికలు


ఆటపాకలో గౌడ సంఘీయుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ, ఎంపీ అభ్యర్థి కారుమూరి

కైకలూరు: రాష్ట్రంలో బీసీలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ, ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. ఆటపాక ఎమ్మెల్సీ నివాస సమీప గ్రౌండ్‌లో నియోజకవర్గ గౌడ, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. తొలుత ఏలూరు రోడ్ నుంచి ర్యాలీగా గౌడ సంఘీయులు తరలివచ్చారు. రాష్ట్ర గౌడ సంఘం వైస్ చైర్మన్ పోసిన చెంచు రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న రోజుల్లో నియోజకవర్గానికి చెందిన చెంచు రామారావుకు రాష్ట్ర స్థాయి పదవిని కేటాయించాలని సీఎంకు చెబుతానన్నారు. నామినేటెడ్ పదవుల్లో సైతం గౌడలకు ప్రాధాన్యత కల్పించారన్నారు. ఎంపీ కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ మాట్లాడుతూ 130 పర్యాయాలు పేదల కోసం బటన్ నొక్కిన సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించడానికి నియోజకవర్గంలో రెండు బటన్లు ఎమ్మెల్యే డీఎన్నార్, ఎంపీగా తనకు నొక్కాలని కోరారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ మాట్లాడుతూ కూటమి నేతలు ప్రలోభపెట్టి నాయకులు, కార్యకర్తలను పార్టీలలో చేర్చుకుంటున్నారని, దీనికి కార్యకర్తలు అధైర్యపడవద్దన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా డీఎన్నార్, ఎంపీగా కారుమూరి సునీల్‌కుమార్ విజయం సాధిస్తారని చెప్పారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు పలువురికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర గౌడ సంఘ కార్పొరేషన్ చైర్మన్ మాధు శివరామకృష్ణ, వైఎస్సార్ సీపీ నేత బీవీ రావు, ఉమ్మడి కృష్ణ జిల్లా గౌడ సంఘ అధ్యక్షులు జోగి సురేష్, నాయకులు రాజులపాటి యశోదరావు, శొంఠి కుమారస్వామి, పోతగాని వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

బీవీరావు సమక్షంలో గురజ జనసేన కార్యకర్తల చేరిక


కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బీవీ రావు

ముదినేపల్లి రూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేయాలని కైకలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు బీవీ రావు పిలుపునిచ్చారు. జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరించిన బీవీ రావు ఇటీవల ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరడం తెలిసిందే. ఈ సందర్భంగా గురజ గ్రామంలో శనివారం రాత్రి బీవీ రావు పర్యటించగా, పలువురు జనసేన పార్టీ కార్యకర్తలు బీవీరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా బీవీరావు మాట్లాడుతూ బీజేపీ, టీడీపీ అభ్యర్థుల వల్ల నియోజకవర్గంలోని ప్రజలకు ఒరిగేదేమి లేదన్నారు. వీరిని గెలిపిస్తే నియోజకవర్గం అధోగతి పాలవుతుందని హెచ్చరించారు. జనసేన, టీడీపీ పార్టీల తప్పుడు వైఖరి నచ్చక ఆయాపార్టీల కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. జగన్ తిరిగి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపడితేనే సంక్షేమ పథకాలు అమలు కావడంతో పాటు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్ యాదవ్‌లను అఖండ మెజార్టీతో గెలిపించి జగనన్న తిరిగి ముఖ్యమంత్రి కావడానికి సహకరించాలని కోరారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, డీఎన్నార్ కోడలు దూలం స్వాతి, పార్టీ నాయకులు పోకల దేవేంద్రగోపాలకృష్ణ, యాదవ సంఘం మాజీ అధ్యక్షుడు పచ్చిగోళ్ళ రామకృష్ణ, నర్రా ప్రభు, నాగదేశి గణేషుబాబు, బుర్ల కిరణ్ యాదవ్, అల్లాడి సతీష్, పేర్ని పృధ్వీ పాల్గొన్నారు.

ఆటో బోల్తా పడి యువకుడి మృతి

కె.గంగవరం: మండల పరిధిలోని కుందూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల శ్రీనివాసరావు (27) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా ముసునూరు మండలం ముసునూరు గ్రామానికి చెందిన శ్రీనివాసరావు ప్యాసింజర్ ఆటోలో పుణ్యక్షేత్రాల దర్శనానికి ఆదివారం ఉదయం బయలుదేరాడు. అప్పనపల్లిలో స్వామివారి దర్శనం అనంతరం పంటుపై ముక్తేశ్వరం నుంచి కోటిపల్లి వచ్చి శ్రీఛాయా సోమేశ్వర స్వామిని దర్శించుకున్నారు. అక్కడ నుంచి ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయానికి బయలుదేరి వెళుతుండగా కుందూరు వచ్చేసరికి తాడిగొయ్యి నుంచి వస్తున్న మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో ఆటో తిరగబడింది. ఆటోలో ఉన్న శ్రీనివాసరావు కిందపడడంతో తలపై బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న కె.గంగవరం ఎస్సై జానీ బాషా సిబ్బందితో కుందూరు చేరుకుని పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు విరాళాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ముగ్గురు భక్తులు వేర్వేరుగా ఆదివారం రూ.3,26,232 లను విరాళంగా అందజేశారు. పెదవేగి మండలం విజయరాయికి చెందిన దేవినేని వాసవి, కుటుంబ సభ్యులు రూ.1,25,116, కామవరపుకోటకు చెందిన ఘంటా పవన్‌కుమార్ రూ.1,01,116, హైదరాబాద్‌కు చెందిన కె.సుబ్బలక్ష్మి రూ.1 లక్ష శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి జమ చేశారు. ఈ సందర్భంగా దాతలకు ఆలయ ఏఈఓ మెట్టపల్లి దుర్గారావు, అన్నదాన ట్రస్టు సూపరింటెండెంట్ రాజు విరాళం బాండ్ పత్రాలను అందించారు.

రసవత్తరంగా బాస్కెట్‌బాల్ పోటీలు

- నేడు సెమీ ఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు
- నూజివీడులో 9వ అంతర్‌జిల్లాల బాలుర, బాలికల జూనియర్ పోటీలు


నూజివీడులో కర్నూలు, వైజాగ్ జట్ల మధ్య హోరాహోరీగా సాగుతున్న మ్యాచ్

నూజివీడు: పట్టణంలో గత రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఏపీ స్టేట్ 9వ అంతర్ జిల్లాల బాలుర, బాలికల జూనియర్ బాస్కెట్‌బాల్ పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఏపీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ పోటీలను లీగ్ కం నాకౌట్ పద్ధతిలో నిర్వహిస్తున్నారు. బాలికల విభాగంలో తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, అనంతపురం జిల్లా జట్లు సెమీస్‌కు చేరాయి. అలాగే బాలుర విభాగంలో లీగ్ పోటీలు ముగిసి క్వార్టర్ ఫైనల్స్ నిర్వహిస్తున్నారు. క్వార్టర్ ఫైనల్స్‌లోకి తూర్పు గోదావరి, గుంటూరు, కర్నూలు, వైజాగ్, అనంతపురం, నెల్లూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జట్లు చేరాయి. కర్నూలు-వైజాగ్ జట్ల మధ్య మ్యాచ్ ముగిసే సమయానికి 48-48 స్కోర్‌తో సమానంగా నిలవడంతో అదనపు సమయం ఇచ్చి మ్యాచ్ కొనసాగించారు. ఈ ఉత్కంఠ పోరులో వైజాగ్ జట్టు కర్నూలు జట్టుపై 57-55 స్కోర్ తేడాతో విజయం సాధించి సెమీఫైనల్‌కు చేరింది. సెమీఫైనల్స్, ఫైనల్స్ మ్యాచ్‌లు సోమవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తనిఖీల్లో రూ.లక్ష నగదు పట్టివేత

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఉంగుటూరు శివారులో జాతీయ రహదారిపై అధికారులు ఆదివారం నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఓ వ్యక్తి నుంచి రూ.1 లక్ష నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఆర్డీఓ ఖాజావల్లీ చెప్పారు. తణుకు నుంచి పెదవేగి వెళుతున్న తణుకుకు చెందిన వల్లూరి సుధాకర్ నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. ఉంగుటూరు ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్-2లో పనిచేస్తున్న హనుమాన్‌బాబు, పోలీసులు ఈ మొత్తాన్ని పట్టుకున్నారని తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో నిందితుడి అరెస్టు

కైకలూరు: ఒంటరి మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన కేసులో ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై టి.రామకృష్ణ చెప్పారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెంచికలమర్రు గ్రామంలో ఓ మహిళకు భర్త నాలుగేళ్ల క్రితం మరణించాడు. కుమార్తెకు ఇటీవల వివాహం చేసి పంపించింది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ముంగర ఫణికుమార్ అనే యువకుడు ఒంటరిగా ఉంటున్న ఆమె ఇంట్లోకి ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. మహిళ యువకుడి చేతిని కొరికి గట్టిగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చేసరికి ఫణికుమార్ పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

చింతలపూడి: ప్రగడవరం గ్రామంలో నున్న రమేష్ అనే వ్యక్తి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని పౌర సరఫరాల అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు జిల్లా పౌర సరఫరాల అధికారికి వచ్చిన సమాచారం మేరకు స్థానిక సివిల్ సప్‌లైస్ డీటీ జరీనా సిబ్బందితో తనిఖీ చేయగా 2 టన్నుల రేషన్ బియ్యం ఉన్నట్లు కనుగొన్నారు. ఇంటి యజమానిపై పౌర సరఫరాల చట్టం ప్రకారం కేసు నమోదు చేసినట్లు డీటీ తెలిపారు.

క్లుప్తంగా

ఉమర్ అలీషాను కలిసిన మంత్రి కారుమూరి


పైడిపర్రులో డా.ఉమర్ అలీషాను కలిసిన మంత్రి కారుమూరి

తణుకు టౌన్: విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠాధిపతి ఉమర్ అలీషాను మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ఆదివారం కలిసి ఆశీస్సులు పొందారు. తణుకు మండలం పైడిపర్రు గ్రామానికి ఉమర్ అలీషా విచ్చేసిన విషయం తెలుసుకున్న మంత్రి కారుమూరి ఆయనను మర్యాదపూర్వకంగా కలుసుకొని ఆశీర్వచనం తీసుకున్నారు. మంత్రి కారుమూరి వెంటనే పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మెట్ట ఉప్పరగూడెంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మెట్ట ఉప్పరగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం రాత్రి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ప్రారంభించారు. వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు ఆధ్వర్యంలో ఈ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు. ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు, నాయకులు చిటకన ప్రసాద్, వీరమళ్ళ సుబ్రహ్మణ్యం, నీలపాల రామన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

బేబి సెంటర్ రోడ్డులో చలివేంద్రం ప్రారంభం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని స్థానిక బేబి సెంటర్ రోడ్డులో మాస్టర్ ప్రింటర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పీటీ వెంకన్న ఆధ్వర్యంలో ఆదివారం కూలింగ్ వాటర్ చలివేంద్రంను ఏర్పాటు చేశారు. కృష్ణవల్లభ ట్రస్ట్‌చే నిర్వహిస్తున్న చలివేంద్రాన్ని బీవీఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుద్దాల వెంకట రామారావు ప్రారంభించారు. దాహార్తులకు చల్లని నీరు అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడవంటిగంటి వెంకట నరసింహాచార్యులు, కంచర్ల నరసింహారావు, దూలం నాగరాజు, బాబూరావు, కాశీ కృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామనవమి ఉత్సవాలు

ఆకివీడు: మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్థానిక వెలంపేటలోని రామాలయం వద్ద నిత్యం విశేష పూజలు నిర్వహిస్తున్నారు. దీనికితోడు ప్రతిరోజు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ విశేషంగా ఆకట్టుకుటోంది. కూరగాయల మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపం వద్ద, మాదివాడ, చెరుకుమిల్లిలోని రామాలయంల వద్ద రాములోరికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ


మస్తాన్ వలీని పరామర్శిస్తున్న పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు

ఆకివీడు: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఏఎంసీ మాజీ చైర్మన్ ఎండీ.మస్తాన్‌వలీని ఆదివారం వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు సోదరుడు పెన్మెత్స గోపాలకృష్ణంరాజు పరామర్శించారు. మస్తాన్ వలీ త్వరగా కోరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో త్రిసభ్య కమిటీ చైర్మన్ కేశిరెడ్డి మురళీ, కౌన్సిలర్ నిమ్మల నాగు, ఎండీ.ఆలీ, షరీఫ్, ఫయాజ్, ఎస్కే.ఆరీఫ్ తదితరులు ఉన్నారు.

అన్నసమారాధన

భీమవరం అర్బన్: మండలంలోని గొల్లవానితిప్ప గ్రామంలో కోదండ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ అర్చకులు సాయినాథ ఆచార్యులు స్వామివార్లకు పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చనలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు. 4 వేల మంది స్వామివారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

పద్దాల వెంకమ్మ జాతర

పెనుగొండ: పెనుగొండ కళాశాల వద్ద శాంతి నగర్‌లో పద్దాల వెంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవం ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి పూజలు, దండకం సమర్పణలు అనంతరం గరగ నృత్యాలు అలరించాయి. అనంతరం గ్రామోత్సవం భారీగా నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు అమ్మవారికి మొక్కుబడులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు తనయుడు చెరుకువాడ వెంకట నరసింహరాజు, పెనుమత్స విశ్వనాథరాజు పాల్గొన్నారు.

సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ మేలు


కొట్టు సత్యనారాయణకు హారతులు పడుతున్న మహిళలు


మండుటెండలోనూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

- మళ్లీ ఆయననే గెలిపించుకుందాం
- డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ
- ఈలి నానితో కలిసి జోరుగా ప్రచారం

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకూ మేలు జరిగిందని, సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండలంలోని కేఎస్ఎస్ కాలనీ, కొండ్రుప్రోలు, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం, అప్పారావుపేట, వెంకట్రావుపాలెం, గొల్లగూడెం, మోదుగగుంట, మెట్ట ఉప్పరగూడెం గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడుతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ జనసేన పార్టీని పెట్టి పవన్ పరువు తీశారనేది అర్థం చేసుకోవాలన్నారు. పవన్‌కు, జనసేన పార్టీకి తాను వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. జగన్‌ను అధికారంలో నుంచి దింపడానికి, చంద్రబాబును సీఎం చేయడానికే జనసేన స్థాపించారని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్రంలో కోట్లాది కుటుంబాలకు రూ.2.70 లక్షల కోట్లను నేరుగా వారి ఖాతాలకు సీఎం జగన్ జమచేశారని గుర్తు చేశారు. ఒక్క రూపాయి లంచం తీసుకోకుండా జగన్ పాలన అందించారన్నారు. ఇటీవల లోకేష్ తాము అధికారంలోకి వస్తే తమకు నచ్చిన వారికే పింఛన్లు, ప్రభుత్వ పథకాలు అందిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే రాష్ట్రంలో సీఎం జగన్‌ను, శాంతి భద్రతల పరిరక్షణకు నియోజకవర్గంలో తనను గెలిపించాలన్నారు. అలాగే నర్సాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. అప్పడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురామ్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అమలు జరగాలంటే తిరిగి జగన్ ముఖ్యమంత్రి కావాలన్నారు. ప్రజా సంక్షేమమే వైఎస్సార్ సీపీ ధ్యేయమన్నారు. మాజీ ఎమ్మెల్యే ఈలి వెంకటమధుసూదనరావు (నాని) మాట్లాడుతూ రాష్ట్రంలోని సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. ఈక్రమంలోనే ప్రధాని నరేంద్ర మోడీ సైతం రాష్ట్రంలోని సంక్షేమ పథకాలపై అధికారులను పంపించి, సర్వే చేయించారన్నారు. అమ్మ ఒడి ద్వారా ప్రతి ఇంటిలోని బిడ్డకు ఆంగ్ల మాధ్యమ విద్యను అందించారన్నారు. గతంలో సీఎం జగన్ మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేశారన్నారు. ఈ ఎన్నికల్లో సీఎం జగన్, కొట్టు సత్యనారాయణలను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. తొలుత జయలక్ష్మి సాయిమందిరంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైస్‌చైర్మన్ చోడగిరి సత్యనారాయణ (చినబాబు), జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పానుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీ కట్టా రంగబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు జద్దు హరిబాబు, మండల మహిళా అధ్యక్షురాలు నూనె రాధాకృష్ణకుమారి, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, గుమ్మళ్ళ తాతారావు, చిక్కాల సత్యనారాయణ, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సర్పంచ్‌లు ఉండ్రాజవరపు చంద్రిక, ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొండుబోయిన కృపావరం, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరుగొలనులో సువార్త సంగీత మహోత్సవం

పెంటపాడు: ఆరుగొలను ఎస్తేరు ప్రార్థనా మందిరంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు సువార్త సంగీత మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. దైవజనురాలు జె. భారతి, యూత్ నాయకులు, గాయకులు డాక్టర్ సాగర్‌బాబుల ఆధ్వర్యంలో పలు ప్రాంతాలకు చెందిన సువార్త గాయకులు, సువార్తికులు ఈ కార్యక్రమంలో పాల్గొని దేవుని ఆధ్యాత్మిక సంగీతం కీర్తనలు ఆలపించారు. అనంతరం ఉజ్జీవ సభలు ప్రారంభమయ్యాయి.

24 నుంచి గూడెంలో రక్షణ స్వర్ణ మహోత్సవాలు

పెంటపాడు: ఈనెల 24 నుంచి మూడు రోజుల పాటు కొండాయి చెరువు సమీపంలో గూడెం ఫెయిత్ చర్చి ఆవరణలో 50వ వార్షిక రక్షణ స్వర్ణ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర పాస్టర్ల సంఘ నాయకులు జీజే జ్యోతి ఆనంద్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన బిషప్ డాక్టర్ జి. రూత్, రక్షణానందం, అనంతపురం గుత్తికి చెందిన బైబిలుమిషను నాయకులు బి. మణి అద్భుతకుమార్, పెదలంకకు చెందిన డాక్టర్ జాన్‌మంగాచార్యులు, విశాఖపట్నంకు చెందిన జెఫన్యాశాస్త్రి, సువార్త సంగీత గాయకులు డాక్టర్ ఎఆర్ స్టీవెన్ సన్‌లు ముఖ్యఅతిథులుగా ఈ సమావేశాలకు హాజరవుతారని జ్యోతి ఆనంద్ తెలిపారు. ఈ నెల 24 నుంచి 27 వరకు సాయత్రం 6 గంటలకు నిర్వహించబోయే ఈ సమావేశాలను పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సంక్షేమ పాలనకే ఓటేయండి

- గ్రామాల్లో విస్తృతంగా వైఎస్సార్ సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం
- నవరత్నాల కరపత్రాలు పంపిణీ
- ఘన స్వాగతం పలికిన ప్రజలు


తణుకు అర్బన్: తణుకులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మంత్రి కారుమూరి కుమార్తె దీపిక


అత్తిలి: బల్లిపాడు చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సతీమణి లక్ష్మీ కిరణ్


అత్తిలి: పెదపేటలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మండల వైఎస్సార్‌సీపీ నాయకులు


ఇరగవరం: రేలంగి శివారు బొబ్బరాజు పాలెం చర్చి వద్ద ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి అల్లుడు దిలీప్ కుమార్

తణుకు టౌన్: ప్రజలకు సంక్షేమ పాలన అందజేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా మద్దతు తెలిపి, ఆశీర్వదించాలని గ్రామాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారు. ఆదివారం కారుమూరి కుమార్తె దీపిక తణుకు పట్టణంలోని 16వ వార్డు వెంకట్రాయపురం, మండపాక గ్రామాల్లో పర్యటించి ఇంటింటికి తిరిగి రాబోయే ఎన్నికల్లో తన తండ్రి కారుమూరి నాగేశ్వరరావును ఎమ్మెల్యేగా, గూడూరు ఉమాబాలను ఎంపీగా గెలిపించాలని కోరుతూ ఓట్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బోడపాటి వీర్రాజు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉండవల్లి జానకి, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సరెళ్ల వీరతాత,మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, యల్లమిల్లి రమేష్ బాబు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. తేతలి గ్రామంలో కమిటీ అధ్యక్షుడు కోటనాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ గారపాటి పద్మజ, సొసైటీ అధ్యక్షురాలు వై విజయమూర్తి, తేతలి సొసైటీ అధ్యక్షుడు పీ సతీష్ రాజు, నాయకులు, కోట స్వామీజీ, భూపతిరాజు రామకృష్ణంరాజు వీరవల్లి సత్యనారాయణ, వలవల కిషోర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో జోరుగా వైఎస్సార్ సీపీ నాయకుల ఎన్నికల ప్రచారం

ఇరగవరం: మండలంలోని 21 గ్రామాల్లో ఆదివారం మండల నాయకులు ఆధ్వర్యంలో ఇంటింటా వైఎస్సార్ సీపీ నాయకుల గెలుపు కోసం ప్రచారం నిర్వహించారు. రేలంగి శివారులో బొబ్బరాజుపాలెంలో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు అల్లుడు దిలీప్ కుమార్ ప్రచారం నిర్వహించారు. తూర్పు విప్పర్రులో ఎంపీపీ కొప్పిశెట్టి అలివేలు మంగ తాయారు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఇంటిలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యేగా కారుమూరి నాగేశ్వరరావును, ఎంపీగా గూడూరి ఉమాబాలను గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు వెలగల సాయిబాబా రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె ఇల్లిందలపర్రు, ఇరగవరం సొసైటీ అధ్యక్షుడు మల్లిరెడ్డి నాగార్జున, చవ్వాకులు శ్రీనివాస్, ఎఎంసీ ఉపాధ్యక్షుడు మామిడిశెట్టి శ్రీనివాస్, మండల బీసీ సెల్ అధ్యక్షుడు కుడిపూడి నాగ సత్యనారాయణ, పులుపు అనిల్, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, చేబ్రోలు పెద్దిరాజు, వడ్డే మార్కేండేయులు ఆయా గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

అత్తిలిలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం.

అత్తిలి: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు భవిష్యత్‌లో కొనసాగాలంటే రానున్న ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్ సీపీని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. అత్తిలి పెదపేటలో వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఖచ్చితంగా అమలు చేసి ప్రజా మన్ననలు పొందిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డేనని అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ఈప్రభుత్వాన్ని మీరంతా ఆశీర్వదించాలని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేసి వైఎస్సార్ సీపీ తణుకు ఎమ్మెల్యే అభ్యర్థిగా కారుమూరి నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థినిగా పోటీ చేస్తున్న గూడూరి ఉమాబాలను గెలిపించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, మాజీ ఏఎంసీ చైర్మన్ కూనపరెడ్డి జయరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు రంభ సూరిబాబు, కంకటాల సతీష్, గారపాటి నాగరాజు, ఆకుల చినబాబు, బుడితి సుజన్‌కుమార్, రాయుడు ధర్మారావు, బుంగా పద్మారావు, యాళ్ల స్వామి పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్న మంత్రి సతీమణి లక్ష్మీకిరణ్

అత్తిలి: తణుకు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి నాగేశ్వరరావు, నర్సాపురం ఎంపీ అభ్యర్థిని గూడూరి ఉమాబాల అభ్యర్థిత్వాలను బలపరుస్తూ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు సతీమణి లక్ష్మీకిరణ్ ఆదివారం అత్తిలి మండలంలో పలు చర్చిలను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఈ కార్యక్రమంలో అత్తిలి మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు అడ్డాల జానకి, జడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్‌అబీబుద్దీన్, జిల్లా ప్రచార కమిటి అధ్యక్షుడు పెన్మెత్స రామరాజు, ఎంపీటీసీ సభ్యురాలు రంభ సుజాత, సర్పంచ్‌లు కసిరెడ్డి బాలాజీ, వేగేశ్న ధనసత్యనారాయణరాజు, తణుకు పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు నూకల కనకదుర్గ, ఉపసర్పంచ్ అడ్డాలరమేష్‌నాయుడు, మాజీ సర్పంచ్ ఆకుల పండుస్వామి, వైఎస్సార్ సీపీ నాయకులు రంభ సూరిబాబు, తోట వెంకటేశ్వరరావు, బి ప్రవీణ్‌రాయ్, నేలపాటి సుబ్బయ్య, యాళ్ల సాధు సుందర్‌సింగ్, రాయుడు ధర్మారావు, కొమ్మర రామారావు, తానుకొండ శేషారావు, రంభ రాంబాబు, బుద్దరాతి దొరబాబు, తీర్థాల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కారుమూరిని గెలిపించాలి...

తణుకు అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ స్ఫూర్తితో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విజయానికి ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని మంత్రి కుమార్తె దీపిక ప్రజలను కోరారు. తణుకు 23వ వార్డులో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మంత్రి కారుమూరి ఎమ్మెల్యేగా గెలిచిన రోజు నుంచి ప్రజలకు అందుబాటులోనే ఉన్నారని, ఎప్పటికప్పుడు ప్రజల కష్టాలు తెలుసుకుని పరిష్కారానికి కృషి చేశారని అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాల ద్వారా నిత్యం ప్రజల్లోనే ఉన్న మంత్రి కారుమూరితోపాటు ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను గెలిపించాలని రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై వేయాలని కోరారు. వైఎస్సార్ సీపీ వైద్యవిభాగం జిల్లా అధ్యక్షుడు, 23వ వార్డు ఇన్‌చార్జ్ డాక్టర్ దాట్ల సుందరరామరాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, యడ్లపల్లి సురేంద్ర, పుల్లెపు సూర్యచంద్రరావు, ఝాన్సీ లారెన్స్, శకుంతల, ధనలక్ష్మి, చంద్రకళ, మానేపల్లి శేఖర్, చింతన్న, కట్టా కిషోర్, రేలంగి రాంబాబు, జిలాని పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ వంక ఇంటింటా ప్రచారం

తణుకు టౌన్: త్వరలో జరిగే సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు ఓట్లేసి గెలిపించాలని కోరుతూ ఆదివారం సాయంత్రం తణుకు పైడిపర్రులో శాసన మండలి సభ్యులు వంక రవీంద్రనాథ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పైడిపర్రులోని డ్రైవర్ కాలనీలోని వైఎస్సార్ సీపీ నాయకులు ఏఎంసీ వైస్ చైర్మన్ మారిశెట్టి శివశంకర్, పట్టణ సచివాలయాల కన్వీనర్ ఇందుగపల్లి బలరామకృష్ణ ఇతర నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి ఓట్లను అభ్యర్థించారు. రాబోయే ఎన్నికల్లో తణుకు ఎమ్మెల్యే అభ్యర్థి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలను ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కె విశ్వేశ్వరరావు, కొత్తపల్లి చరణ్, చినిమిల్లి సాంబశివరావు, డీ హేమ శ్రీలత, మోపిదేవి శ్రీను, కాసా ఏడుకొండలు, కనకరావు, నిమ్మకాయల బాలాజీ, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలల్లో ప్రతిభ, సంస్కారం పెంపొందించాలి


తణుకు రామకృష్ణ సేవా సమితి భవన్‌లో మాట్లాడుతున్న పాకాల త్రినాథ్

తణుకు టౌన్: గ్రామాల్లో విద్యనభ్యసిస్తున్న బాల బాలికల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించడంతో పాటు వారిలో సంస్కారం తదితర నైపుణ్యాలను వృద్ధి చేసేందుకు సమరత సేవా ఫౌండేషన్ సంస్థ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ చెప్పారు. ఆదివారం తణుకులోని రామకృష్ణ సేవా సమితి భవన్‌లో నిర్వహించిన జిల్లా బాల వికాస కేంద్రాల వార్షికోత్సవ వేడుకలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమానికి జిల్లా బాల వికాస కేంద్రాల ఉపాధ్యాయ ప్రముఖ్ పిండి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమరత సేవా ఫౌండేషన్, టీటీడీ ఆర్థిక సాయంతో జిల్లాలోని 325 గ్రామాల్లో బాల వికాస కేంద్రాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల వికాస కేంద్రాలల్లో అందిస్తున్న వివిధ సేవలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమాల్లో బాల వికాస కేంద్రాలకు చెందిన విద్యార్థినీ, విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ గోదావరి విభాగ సహ కార్యనిర్వాహకుడు ఎం మురళీ కృష్ణ, చింతాకుల గోపాలకృష్ణ, సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా కన్వీనర్ బోణం వెంకటలక్ష్మి, జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన బాల వికాస కేంద్రాల ఉపాధ్యాయులు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

జగన్ మరోసారి సీఎం కావాలి


పెదతాడేపల్లి గ్రామంలో జరిగిన దళిత సేన సమావేశం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: బడుగు, బలహీనవర్గాల వారు ఆర్థికంగా సంక్షేమ ఫలాలు పొందాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావాలని దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ అన్నారు. ఆదివారం సాయంత్రం మండలంలోని పెదతాడేపల్లి గ్రామంలో దళిత సేన జిల్లా కార్యాలయంలో దళిత సేన, మహిళా చైతన్య సేన జగజ్జీవన్‌రామ్ చర్మకారుల కార్మిక సంక్షేమ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం చీలి మోహనరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీల సంక్షేమం కోసం ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. దళిత సేన, మహిళా చైతన్య సేన, జగజ్జీవన్‌రామ్ చర్మకారుల కార్మిక సంక్షేమ సంఘం సభ్యులు సమష్టిగా కృషి చేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలను గెలిపించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దళిత సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాకర్లమూడి వెంకట్రావు, మహిళా చైతన్య సేన జిల్లా అధ్యక్షురాలు దిర్శిపాముల పుష్ప, నియోజకవర్గ అధ్యక్షుడు దూలపల్లి సత్తయ్య, కడియద్ద గ్రామ అధ్యక్షుడు గెడ్డం సుందరరావు పాల్గొన్నారు.

వృద్ధులకు ఉచిత వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిషా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ప్రతి ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య సేవల కార్యక్రమంలో భాగంగా ఆదివారం తణుకులోని వివిధ ప్రాంతాల్లోని 8 మంది వృద్ధులకు ఇంటి వద్దనే వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. నేత్ర వైద్యులు డాక్టర్ హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యులు సుంకవల్లి నీలు మహేంద్ర, డాక్టర్ పీ సత్యనారాయణ మూర్తిలు తణుకు పాతూరు, పైడిపర్రు, తదితర ప్రాంతాల్లోని పర్యటించి ఇంటి నుంచి నడవలేని వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అసోయేషన్ కార్యదర్శి కేవీ సత్యనారయణ, కోశాదికారి ఆర్జి భాస్కరరావు, సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం


లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక కడకట్లలోని జనతా చారిటబుల్ ట్రస్ట్ ఆవరణలో ఆదివారం క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామోహన్‌రావు ఆధ్వర్యంలో నిడదవోలు రాజేశ్వరి రామకృష్ణన్ నేత్ర వైద్యశాల వైద్యులు బృందంతో కంటి పరీక్షలు జరిగాయి. జిల్లా డిప్యూటీ గవర్నర్ పదం కుమార్ గుప్తా ఆర్థిక సహకారం అందించారు. 108 మందికి కంటి పరీక్షలు జరిగాయి. ఉచిత కంటి ఆపరేషన్లు నిమిత్తం 11 మందిని నిడదవోలుకు పంపారు. 22 మందికి ఉచితంగా కళ్లజోడ్లు అందజేసేందుకు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్‌పర్సన్ మదన్‌మోహన్ అగర్వాల్, ఎన్వీ రమణరావు, చిన్నం జగదీష్, ఎల్ఎస్వీ నాగేశ్వరరావు, పేరూరి కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించండి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వేసవి ఉష్ణోగ్రతలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ సబ్ డివిజన్ విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు రొక్కాల నాగ బుజ్జి సూచించారు. ఆదర్స్ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో ఆదివారం కార్యదర్శి రొక్కాల ఆశీర్వాదం అధ్యక్షతన మహిళలకు వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎం .రోజా, ఆర్గనైజేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి కోరారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం సంఘ రాష్ట్ర కమిటీ సమావేశం వాక రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించారు. నరసింహమూర్తి మాట్లాడుతూ గీత కార్మికుల సంక్షేమానికి ప్రతి ఏటా రూ. 5 వేల కోట్లు నిధులు కేటయించాలన్నారు. ఏక్స్‌గ్రేషియ రూ. 10 లక్షలు, పెన్షన్‌ను 5 వేలకు పెంచడం, పెళ్లి కానుక లక్ష రూపాయిలు పెంచాలని, కల్లుగీత సొసైటీలకు 40 శాతం మద్యం షాపులు కేటాయించాలని, గీత వృత్తికి రక్షణ కల్పించాలన్నారు. కార్మికులకు సంక్షేమాలను అమలు చేయాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. యర్రా దేముడు, కామన మునిస్వామి, కుడుపూడి పెద్దిరాజు, కడలి పాండు, కోమటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి

పాలకోడేరు: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని ఎస్సై నాళం శ్రీనివాసరావు అన్నారు. కోరుకొల్లులో ఆదివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రజలు నిర్భయంగా ఓటు వేయాలని, ఎలాంటి ప్రలోభాలకు గురికావద్దని భరోసా ఇచ్చారు.